

హాసనాంబ ఆలయ ప్రధాన ద్వారం వద్ద భక్తుల రద్దీ

జనసంద్రంగా హాసన్

- హాసనాంబ దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు
- ఆలయానికి రెండు రోజుల్లో రూ.2.4 కోట్ల ఆదాయం

బెంగళూరు, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): హాసనాంబదేవి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. శనివారం రాత్రి పొద్దుపోయేదాకా భక్తులు బారులు తీరారు. వీఐపీ పాసుల రద్దుతో రూ.300, 1000 రూపాయల టిక్కెట్లను కొనుగోలు చేసి దర్శనం చేసుకుంటున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కృష్ణబైరే గౌడ హాసన్‌లోనే ఉంటూ పర్యవేక్షణలు సాగిస్తున్నారు. కేవలం టికెట్ల ద్వారానే ఒక్కరోజుకే రూ.63 లక్షలు సమకూరినట్టు ఆలయ కమిటీ ప్రకటించింది. రెండురోజుల్లో దర్శన టిక్కెట్లతోపాటు ప్రసాదం విక్రయాల ద్వారా కోట్ల రూపాయలు సమకూరినట్లు తెలుస్తోంది. కాగా హాసనాంబ దర్శనానికి వస్తున్న భక్తులకు గోల్డ్‌కార్డులు పంపిణీ చేసేవేళ కార్డులు స్కాన్ చేయకుండానే వదులుతున్నట్టు గుర్తించారు. ఈమేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు గోవిందరాజ్, యోగానంద, విలేజ్ అసిస్టెంట్‌లు సంతోష్ అంబగిరి, శిరాజ్ మహిమాపటేల్‌లను సస్పెండ్ చేస్తూ జి ల్లా అధికారి లతా కుమా రి ఆదేశాలు జారీ చేశారు. రెండురోజుల వ్యవధిలో రూ.2.4 కోట్ల ఆదాయం వచ్చినట్టు ప్రకటించారు. జాతరలో వివిధ కార్యక్రమాలు చూసేందుకు సమీప ప్రాంతవాసులు తరలివస్తున్నారు.



క్యూలైన్లలో వేచివున్న భక్తులు

6 అంగుళాలు కూడా ఇచ్చేది లేదు

- పెద్దల కోసమే సొరంగ మార్గం: ఎంపీ తేజస్వి సూర్య



లాల్‌బాగ్‌లో ప్రజలతో ఎంపీ తేజస్వీసూర్య

7

దాతల సహకారంతో ఆలయాల

జీర్ణోద్ధరణ



శిథిలావస్థకు చేరుకున్న ఓ ఆలయం

- 'సీ' గ్రేడ్ ఆలయాలకు కొత్తశోభ
- రూపుమారనున్న పురాతన ఆలయాలు
- బ్లూప్రింట్ తయారీకి సిద్ధమైన ప్రభుత్వం
- తీరనున్న 40వేల మంది అర్చకుల అవస్థలు

బెంగళూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పురాతన ఆలయాల పునరుద్ధరణకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. దాతల సహకారంతో గుడుల ప్రక్షాళనకు సిద్ధం అయ్యింది. ఓ పల్లెలో వంద కుటుంబాలు ఉన్నాయంటే అక్కడో దేవాలయం వెలసి ఉంటుంది. ఇక ఇష్టదైవానికి పూజలు చేసేందుకు అనుకూలంగా గుడుల నిర్మాణం దశాబ్దాల కిందటే సాగింది. ప్రతి పల్లెలోనూ శ్రీరాముడు, ఆంజనేయస్వామి, వేణుగోపాల స్వామి, సప్తమాతృక దేవతలతోపాటు చాముండేశ్వరి, అణ్ణమ్మ, మారమ్మ, ఎల్లమ్మ ఆలయాలు ఉన్నాయి. ప్రాచీన ఆలయాలలో నిత్య పూజలతోపాటు ఏడాదిలో రెండు మూడు పండుగలకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుకూలంగా భూములను కేటాయించేవారు. ఇలా పల్లెల్లో పలు వృత్తులు చేసేవారికి ఇనాంగా భూములు ఇచ్చేవారు. వారు ఆలయ కార్యక్రమాల్లో ఏడాది పొడవునా వృత్తిపరమైన సేవలు కొనసాగించేవారు. ఇలా ఆలయాల్లో నిత్యపూజలకు ఇతరత్రా సేవలకు ఎటువంటి ఆటంకం ఉండేది కాదు. అర్చకులు దేవుడి పేరిట ఉండే భూమిని సాగు చేసుకునేవారు. ఇటీవల మూడు నాలుగు దశాబ్దాలుగా కరువు విలయతాండవం చేయడం మరోవైపు ఆలయభూములు, వృత్తిపరమైన వారికోసం కేటాయించిన ఇనాం భూములను విక్రయించుకునే వెసలుబాటు రావడంతో గ్రామాల్లో జీవనం కష్టమై ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు భూములను విక్రయించుకున్నారు. ఇలా వృత్తిపరమైన సేవలు చేసేవారు వలసలు వెళ్లడం, కరువుతోపాటు పలు కారణాలతో ఆలయాల మనుగడ కష్టతరంగా మారింది. మరోవైపు సాయిబాబాతోపాటు పలు ఆలయాలు ఏర్పడ్డాయి. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 34వేలకు పైగా ఆదాయం లేని ఆలయాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏ గ్రేడ్, బీ గ్రేడ్ ఆలయాలకు రోజువారీ ఆదాయం ఉండడం, వివిధ సేవలు అనుకూలం అవుతున్నాయి. ఆదాయం లేని 'సీ' గ్రేడ్ ఆలయాలు కనీస మరమ్మతులకు నోచుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో రాష్ట్ర దేవదాయశాఖ అన్ని దేవాలయాలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కసరత్తు జరుపుతోంది.

ప్రత్యేక బృందంతో కమిటీ


ఆలయాలకు ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయలు ఖర్చు చేసే పరిస్థితి లేదు. దీంతో దాతల సహకారంతో ఆలయాల్లో మార్పులు తీసుకొచ్చేందుకు దేవదాయశాఖ కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టింది. ఆలయాలంటే కేవలం అవి ఆధ్యాత్మిక కేంద్రాలు మాత్రమే కాదు. నాటి కళలు, సంస్కృతి, సంప్రదాయాలను సంరక్షించే కేంద్రంగాను చెప్పవచ్చు. కాలానుగుణంగా నిర్లక్ష్యానికి లోనైన ఆలయాలకు జీర్ణోద్ధరణ జరపాలని భావిస్తున్నారు. శిల్పకళలు, భారీ స్తంభాలు కల్గిన వందలాది ఆలయాలు మూతపడి ఏళ్ల తరబడి తెరుచుకునే పరిస్థితి లేకుండాపోతోంది. అటువంటి ఆలయాలను గుర్తించి వివిధ సంస్థలు, దాతలు, విద్యాసంస్థలు, స్థానికులను భాగస్వామ్యం చేసుకుని జీర్ణోద్ధరణకు సహకరించాలని దేవదాయశాఖ కోరుతోంది. కొత్తగా విజన్ గ్రూప్ సభ ఏర్పాటు చేసి బ్లూ ప్రింట్‌ను తయారు చేయాలని నిర్ణయించారు. పదిమంది కలసి ఒక విషయాన్ని చర్చిస్తే అర్థవంతంగా పరిష్కారం లభిస్తుందని దేవదాయశాఖ భావిస్తోంది. అందుకే విజన్ గ్రూప్‌ను ఏర్పాటు చేసింది. అన్ని సీ గ్రేడ్ ఆలయాలలోని సమస్యలను ఒక ప్రణాళికగా తయారు చేసి ఏ ఆలయంలో ఎలాంటి సౌలభ్యాలు కావాలి, పునరుద్ధరణకు ఎంత సొమ్ము అవసరం అనే బ్లూ ప్రింట్‌ను తయారు చేయదలిచారు.

దయనీయంగా అర్చకుల పరిస్థితి

ఆలయాలలో పనిచేసే అర్చకుల జీవన పరిస్థితి కూడా అధ్వానంగా తయారయ్యింది. పురాతన ఆలయాలలో వాటి ప్రాంగణంలోనే అర్చకులు నివసించేందుకు వెసలుబాటు ఉండేది. ఇలా ఎంతోమంది పాడుబడిన ఆలయాల ప్రాంగణంలోనే జీవనం సాగించారు. కొంతమంది వయసుపైబడి ఇతరత్రా అనారోగ్యాలతో అర్చకులు మృతి చెందిన సందర్భాలు ఉన్నాయి. గుడి బాగుండాలంటే జీర్ణోద్ధరణ కావాలి. అందుకు తగ్గట్టుగా అర్చకుల ద్వారా నిత్యపూజలు, ప్రత్యేక సేవలు కొనసాగాలి. అప్పుడే భక్తులు కూడా ఆలయాలకు వచ్చే సంప్రదాయం పెరుగుతుంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన విజన్ గ్రూప్ సభ్యుడు ప్రొఫెసర్ రాధాకృష్ణ అభిప్రాయం మేరకు రాష్ట్రంలో 38వేల దేవదాయశాఖ ఆలయాలు ఉన్నాయి. వీటిలో 34వేల ఆలయాలు సీ కేటగిరీకి చెందినవి ఉన్నాయి. ఇందులోనూ ఐదారు వందల ఏళ్ల పైబడిన గుడులు ఉన్నాయి. చారిత్రాత్మకతంగా ప్రముఖమైనవి అయినా వివిధ కారణాలతో నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఆలయాల పునరుజ్జీవనం ప్రధాన ఆశయంగా పెట్టుకుని బ్లూ ప్రింట్‌ను రూపొందించి, తొలుత దేవస్థానం స్థితిగతులపై నివేదిక రూపొందించాలని నిర్ణయించారు. పూర్తిస్థాయిలో జీర్ణోద్ధరణకు ఎంతమేర ఆర్థికసాయం అవసరం అవుతుందనేది అంచనా వేసి ప్రైవేట్ కంపెనీలు, సీఎస్ఆర్ నిధులతోపాటు విద్యాసంస్థలు, లేదా పలుకుబడి కల్గినవారు, రాజకీయనేతల సహకారం తీసుకోదలిచారు. ఒక గ్రామానికి చెందినవారు కొన్నేళ్లక్రితం వలస వెళ్లి ఏదైనా ప్రాంతం లేదా దేశంలో స్థిరపడి ఉంటే వారిని భాగస్వామ్యులు చేయదలిచారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో ఆలయాల పునరుద్ధరణకోసం వలసవెళ్లినవారితో పాటు స్థానికులకు రూ.10వేలతో ఒక సభ్యత్వంగా ప్రకటించి పునరుద్ధరించిన సంఘటనలు ఉన్నాయి. ఇలా ప్రాంతాలవారీగా కొన్నిసంఘాలు ఆలయాల జీర్ణోద్ధరణకు కృషి చేస్తున్నాయి.

తొలిదశలో ఆలయాల మరమ్మతులు

- దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి



కొప్పళ, తుమకూరు, చిత్రదుర్గ, మైసూరు రీజియన్‌లోని పలు గ్రామాల్లో అనేకమైన పాత ఆలయాలు ఉన్నాయి. అవి పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. తొలిదశలో ఆలయాల మరమ్మతులు, రంగులువేయడం, చిన్నపాటి మౌలిక సదుపాయాలు కల్పించడం, సమాచార బోర్డులు ఏర్పాటు చేయడం, ఒక ఆలయాన్ని స్థానికంగానే కాకుండా జాతీయ రహదారులు, ఇతరత్రా ప్రముఖమైన రైల్వేస్టేషన్‌లు, ఎయిర్‌పోర్టులలో వాటికి సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సీ గ్రేడ్ ఆలయాలను అభివృద్ధి చేసేందుకు అర్థపూర్వకంగా పథకం అమలు చేసేందుకు విజన్ గ్రూప్ ఏర్పాటు చేశామని దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి తెలిపారు.

ఇద్దరు మంత్రులతో సీఎం ప్రత్యేక చర్చలు

- కేబినెట్‌లో మార్పులపై జోరుగా ఊహాగానాలు
- బిహార్ ఎన్నికల తర్వాతే ముహూర్తం..!



బెంగళూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ విస్తరణ అంశం తారస్థాయిలో చర్చ సాగుతున్న తరుణంలో కేబినెట్‌లోని సీనియర్ మంత్రులు ఇద్దరితో సీఎం సిద్దరామయ్య ఇద్దరు సీనియర్ మంత్రులతో రహస్య చర్చలు జరిపారు. ఈ అంశం కాంగ్రెస్ వర్గాలలో తీవ్ర చర్చకు కారణమైంది. హోం మంత్రి పరమేశ్వర్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్పలతో సుమారు గంటపాటు సీఎం చర్చలు జరిపారు. నవంబరులో క్రాంతి లేదని అది కేవలం భ్రాంతి అని బహిరంగంగానే సీఎం వ్యాఖ్యానించారు. అయినా రెండురోజులుగా పలు అంశాలపై వాడివేడిగా చర్చలు సాగుతున్నాయి. ఏకంగా 20మంది దాకా మంత్రులను తొలగిస్తారనే కథనాలు హల్‌చల్ చేస్తున్నాయి. విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప శివమొగ్గలో మీడియాతో మాట్లాడిన వేళ రెండున్నరేళ్ల విద్యాశాఖలో మార్పులు, సాధనలు వివరించడం ఓ విధమైన సంకేతాలు ఇచ్చినట్టయ్యింది. నాయకత్వ మార్పు అంటే దళిత సీఎం ప్రస్తావన తెరపైకి వచ్చే అవకాశాలు లేకపోలేదు. ఇప్పటికే రెండు రోజులక్రితం మంత్రులు మహదేవప్ప, పరమేశ్వర్, సతీశ్‌జార్కిహొళిలు రహస్యంగా భేటీ అయిన విషయం తెలిసిందే. తాజాగా ఇద్దరు సీనియర్ మంత్రులతో సీఎం రహస్య చర్చలు జరపడం మరిన్ని ఊహాగానాలకు కారణమవుతోంది. నవంబరు 14న బిహార్ శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. డిసెంబరులో బెళగావిలో శాసనసభ శీతాకాల సమావేశాలు జరగాల్సి ఉంది. ఈలోగా మార్పులు ఉంటాయనే చర్చలు సాగుతున్నాయి.



ప్రజాభిప్రాయ సేకరణం..!

- 'బెంగళూరు వాక్'లో మంత్రి డీకే శివకుమార్, ఎమ్మెల్యే మునిరత్న మధ్య వాగ్వాదం
- ప్రొటోకాల్ పాటించలేదని ఎమ్మెల్యే ఆగ్రహం
- రోడ్డుపై బైఠాయించి నిరసన



ప్రజాభిప్రాయ సేకరణలో మంత్రి డీకే



రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్యే మునిరత్న

బెంగళూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ) ఏర్పడిన తరుణంలో ప్రాంతాలవారీగా పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణకు డీసీఎం డీకే శివకుమార్ సిద్ధమైన విషయం తెలిసిందే. రెండోరోజు ఆదివారం జేపీ పార్క్‌లో పర్యటించారు. అయితే స్థానిక ఎమ్మెల్యే మునిరత్నకు, మంత్రి డీకేల మధ్య వాగ్వాదం కలకలం రేపింది. అనంతరం నిర్వహించిన సభావేదిక వద్ద కింద కూర్చుని స్థానిక రాజరాజేశ్వరినగర్ ఎమ్మెల్యే మునిరత్న నిరసన తెలిపారు. ఇదే సందర్భంగా డీసీఎం డీకే శివకుమార్ వేదికపై నుంచే 'ఏ నల్లటోపీ ఇక్కడకు వచ్చి కూర్చో ఎమ్మెల్యే' అంటూ సంబోధించారు. దీంతో సభావేదికపైకి వెళ్లిన మునిరత్న మాట్లాడుతూ ఇది ప్రభుత్వ కార్యక్రమమని, గ్రేటర్ బెంగళూరుకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ కోసం జరుపుతున్నదని, అయితే స్థానిక ఎమ్మెల్యేగా తనకు ఆహ్వానం లేదన్నారు. అందుకే ప్రజలమధ్యన కూర్చుంటానని సవాల్ చేశారు. ఇదే సందర్భంగా వివాదాలకు కారణం కాకుండా పోలీసులు రక్షణగా నిలిచారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలలో పథ సంచలనంలో పాల్గొని అక్కడనుంచి ఎమ్మెల్యే నేరుగా సభకు వచ్చారు. అనంతరం ప్రజాభిప్రాయ సేకరణ సభ సజావుగా సాగింది. అనంతరం ఎమ్మెల్యే మునిరత్న మీడియాతో మాట్లాడుతూ ఓ మహిళకోసం వివాదం సాగుతోందని, చన్నపట్టణ, రామనగరలనుంచి తనపై దాడి చేసేందుకు పిలిపించారని, ఇది ప్రభుత్వ కార్యక్రమమైనా కేవలం కాంగ్రెస్ ఫ్లెక్సీలు వేసుకున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే, ఎంపీ ఫొటోలు లేకుండా ఫ్లెక్సీలు ఎలా వేస్తారని ప్రశ్నించారు. వారికి ఒక్కటే టార్గెట్ అని, తన రాజీనామాకు పట్టుబట్టారన్నారు. పోలీసులు లేనిపక్షంలో ఇక్కడ తనను హతమార్చాలనే కుట్ర పన్నారని ఆరోపించారు. సీఎం సిద్దరామయ్య ఇప్పటికే ఎమ్మెల్యేలను సభలకు ఆహ్వానించాలని సూచించారని, కానీ డీసీఎం వాటిని పాటించరన్నారు.



కామాక్షి పాళ్యలో..



పద్మనాభనగర్‌లో పథసంచలనంలో ప్రతిపక్షనేత అశోక్, ఎంపీ పీసీ మోహన్



ఊరేగింపులో బాలుడు

నమస్తే సదా వత్సలే..

- ఉప్పొంగిన దేశభక్తి
- ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

బెంగళూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఏర్పడి వందేళ్లు పూర్తైన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఉదయం బెంగళూరుతోపాటు వివిధ ప్రాంతాల్లో బీజేపీ, విశ్వహిందూ పరిషత్‌తోపాటు సంఘ్ కార్యకర్తలు పథసంచలనం జరిపారు. పద్మనాభనగర్‌లో జరిగిన పథసంచలనంలో ప్రతిపక్షనేత అశోక్, ఎంపీ పీసీ మోహన్ సహా పలువురు భాగస్వామ్యులయ్యారు. వీధులగుండా ఆర్ఎస్ఎస్ శ్లోకాలను పాడుకుంటూ ఊరేగింపు జరిపారు. వాహనంపై భారతమాతతోపాటు ఆర్ఎస్ఎస్ ప్రముఖుల చిత్రపటాలతో సాగిన ఊరేగింపులో ప్రజలు పూలు చల్లి జేజేలు పలికారు. చిక్కపేటలో స్థానిక ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్‌తోపాటు పలువురు పథసంచలనం జరిపారు. జేసీ నగర్ మునీశ్వర దేవస్థానం వద్ద ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పంథసంచలనం జరిపారు. విఠల్, ప్రకాశ్, ప్రసన్న, పార్థసారథితోపాటు పలువురు పాల్గొన్నారు. ఇదే విధంగా నగరంతోపాటు మంగళూరు, ఉడుపి, ఉత్తర కన్నడ జిల్లాలతోపాటు ఉత్తర కర్ణాటక వ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు సాగాయి.



జేసీ నగర్‌లో ఆర్ఎస్ఎస్ ర్యాలీ

కసవనహళ్లిలో రామ్‌రాజ్ షోరూంకు శ్రీకారం

బెంగళూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ కాటన్ దుస్తులకు పేరొందిన రామ్‌రాజ్ సంస్థ బెంగళూరులో మరోశాఖను లాంచనంగా ప్రారంభించింది. ఎలక్ట్రానిక్‌సిటీ పరప్పన అగ్రహార పరిధిలోని కసవనహళ్లిలో ఆదివారం రామ్‌రాజ్ షోరూంను పరప్పన అగ్రహార పోలీస్ ఇన్‌స్పెక్టర్ సతీశ్ బీఎస్ లాంచనంగా ప్రారంభించారు. రామ్‌రాజ్ కాటన్ ఫౌండర్ ఛైర్మన్ కేఆర్ నాగరాజన్ మాట్లాడుతూ సంప్రదాయ దుస్తులకు రామ్‌రాజ్ పేరొందిందన్నారు. బెంగళూరులో దేశ విదేశాలకు చెందినవారంతా నివసిస్తున్నారని, వారికి అనుకూలంగా ఉండేలా ప్రాంతాలవారీగా షోరూంలను తెరిచామన్నారు. ఫ్యాన్సీ బోర్డర్ ధోతీలు, పంచకచ్చ, సిల్క్ శుభముహూర్త ధోతీలు, ఎంబ్రాయిడరీ ధోతీలు, పెర్ఫ్యూమ్డ్ ధోతీలు మా ప్రత్యేకత అన్నారు. కాటన్‌షర్ట్, శుభముహూర్త డిజైన్‌లతోపాటు అన్ని వర్గాల ప్రజలకు ఆకట్టుకునేలాంటి సంప్రదాయ దుస్తులు రామ్‌రాజ్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో గోల్డ్‌సాచ్ టీమ్ మేనేజర్ మోహన్ వివేకానంద, డెలాయిట్ కంపెనీ టీమ్ మేనేజర్ నమ్రతాలు ముఖ్యులుగా పాల్గొన్నారు. మహాలక్ష్మి అమ్మణ్ణి కాలేజ్ హెచ్ఓడీ ఉషా జగద్రక్షకన్ తొలి కొనుగోలు చేశారు.



శాఖను ప్రారంభిస్తున్న సీఐ సతీశ్ బీఎస్ తదితరులు

ఘనంగా రాజ్‌కుమార్ కాంస్య విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో నటుడు శివరాజ్ దంపతులు తదితరులు

దొడ్డబళ్లాపుర, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత ఆసుపత్రి సమీపాన జయ చామరాజేంద్ర సర్కిల్‌లో ఆధునీకరించిన కన్నడ కంఠీరవుడిగా పేరొందిన డాక్టర్ రాజ్‌కుమార్ కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. తాలూకా శివరాజ్‌కుమార్ కన్నడ సేనా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో నటుడు డాక్టర్ శివరాజ్‌కుమార్, గీతా దంపతులు పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివరాజ్ కుమార్ మాట్లాడుతూ అభిమానుల అభిమానం మరవలేనన్నారు. అప్పు సినిమా పాటలు పాడి అలరించారు. కొన్ని డైలాగ్‌లు చెప్పి అలరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్, నగరసభ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, స్థాయి సమితి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.91	1631.94
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	11,189	28,490
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,217	27,406
నీటి నిల్వ (టీఎంసీలు)	79.50	101.54

అక్రమ కట్టడాల తొలగింపు

● హులిగమ్మ దేవస్థానం వద్ద క్యూలైన్ల ఏర్పాటుకు నిర్ణయం ● అనధికార కట్టడాలపై అధికారుల కొరడా



కూల్చివేత పనుల్లో ఎక్స్‌కవేటర్లు



ప్రధాన గోపురం ఎదురుగా కూల్చేసిన దుకాణాలు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): హులిగిలో వెలసిన హులిగమ్మదేవి దేవస్థానం ప్రధాన వీధిలో అక్రమణలకు గురైన ప్రాంతాలను జిల్లా పాలనా మండలి ఆధ్వర్యంలో తొలగింపు కార్యాక్రమానికి శ్రీకారం చుట్టారు. గతవారం మంగళవారం పౌర్ణమి రోజున దేవిదర్శనానికి వచ్చిన లక్షలాది మంది భక్తులు సంచారానికి రోడ్డుకు ఇరుప్రక్కల ఏర్పాటు చేసుకున్న దుకాణాలతో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. భక్తుల మధ్య తొక్కిసలాట జరిగిన కారణంగా అస్వస్థతకు గురికాగా, కొంతమంది ఆసుపత్రిలో చేరాల్సిన పరిస్థితి నెలకొంది. భక్తులను అదుపు చేయడాకి ఏకంగా జిల్లా పోలీసు యంత్రాంగం రంగంలోకి దిగాల్సి వచ్చింది. ఇకపై అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది ఏర్పడరాదనే ఉద్దేశంతో హులిగమ్మ దేవి దేవస్థానం అభివృద్ధి మండలి, స్థానిక గ్రామ పంచాయతీ, పోలీసు శాఖ సహకారంతో గత మూడు రోజులుగా ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను తొలగించారు. రెండు రోజుల ముందుగానే అక్రమ కట్టడాలు, అంగళ్ళను తొలగించాలని సూచిస్తూ స్థానికులకు, వ్యాపారస్తులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కొంతమంది వ్యాపారులు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలను తొలగించారు. అధికారుల ఆదేశాలను పట్టించుకోని వారిని అధికారులే స్వయంగా తొలగించారు. ఇప్పటికే హులిగమ్మ దేవాలయం అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసిన నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ నేతృత్వంలో శనివారం ఉదయం తెల్లవారు జామున అక్రమణల తొలగింపు ప్రారంభించారు. దేవస్థానంతో పాటు వాణిజ్య దుకాణలు, ముందుభాగంలో ఏర్పాట్లు చేసుకున్న షెడ్లు, రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసుకున్న మిఠాయి బళ్ళు, అలంకారిక వస్తువులు అంగళ్ళు తదితర వాటిని తొలగించారు. నంది సర్కిల్, రైల్వే గేట్ ముందుభాగంలో ఏర్పాటు చేసుకున్న అనధికృ హోటళ్ళు, మాంసం అంగళ్ళను కూడా తొలగించారు. ఇదే సందర్భంలో భక్తులకు సరైన నీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేవని భక్తులు, స్థానిక ప్రజలు జిల్లాధికారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జిల్లాధికారిసురేష్ ఇట్నాళ్, ఎస్పీ డాక్టర్ ంరామ్ ఎల్.అరసిద్ధి, జిల్లా పంచాయతీ సీఈఓ వర్షిత్ నేగి, కొప్పళ గ్రామీణ పోలీసు స్టేషన్ సీపీఐ సురేష్ డి. ఉప విభాగం అధికారి క్యాప్టన్ మహేష్ మాలగిత్తి, ప్రాధికార కార్యదర్శి ఎం.హెచ్. ప్రకాష్‌రావ్, పిఇఓ గురుదేవమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

● జడ్పీ సీఈఓ మహమ్మద్ హారీస్



బళ్లారి సిటీ, అక్టోబరు 12(ఆంధ్ర జ్యోతి): బళ్లారి లోక్‌సభ నియోజవర్గం ఎంపీ తుకారం సోమవారం నగరంలోని కోట ప్రాంతం జిల్లాపంచాయతీ ఆవరణలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని జిల్లాపంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్ ఒక ప్ర కటనలో తెలిపారు. సమస్యలున్న ప్రజలు, ప్రజాప్రతినిధులు వాటిని నేరుగా అందజేయవచ్చన్నారు. అదేరోజు జిల్లాపంచాయతీ జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ 'దిశ' యొక్క రెండవ త్రైమాసిక సమావేశాన్ని నగరంలోని జిల్లాపంచాయతీ హాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీ తుకారాం అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సంబంధిత అధికారులు అవసరమైన సమాచారంతో తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

మహిళ ఆత్మహత్య

రాయచూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా చిక్క ఉప్పేరి గ్రామంలో వివాహిత మహిళ బసమ్మ(28) శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన బసమ్మ ఇంట్లోనే చోటు చేసుకోగా మృతురాలి తల్లి గురుబస్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లింగసుగూరు పోలీసులు బసమ్మ భర్త సిద్ధలింగప్ప పై కేసు నమోదు చేశారు. కొన్నేళ్ల క్రితం బసమ్మతో సిద్ధలింగప్పకు వివాహం జరిపించగా కొన్నాళ్లుగా సిద్ధలింగప్ప తన భార్యను మానసికంగా, శారీరకంగా వేదిస్తున్నట్లు తల్లి ఆరోపించారు. ఈ క్రమంలో తమ కూతురు ఇంట్లో చీరకొంగుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించారని భర్తనే చంపి ఉంటాడని అనుమానం వ్యక్తం చేయడంతో సంఘటన స్థళాన్ని పరిశీలించిన లింగసుగూరు ఎస్‌ఐ పుండలిక పటాతార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

భారీ వాహనాలతో దెబ్బతింటున్న వంతెన



వంతెన కిందిభాగంలో లీక్ అవుతున్న నీటిని చూపుతున్న ఏసీ దానప్ప

కంప్లి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : కంప్లి కోట వద్దనున్న వంతెనపై బరువైన వాహనాలకు అనుమతి కల్పించరాదని కేంద్ర రాష్ట్ర దిశ సమితి సభ్యులు డాక్టర్ ఏసీ దానప్ప కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోటే ప్రాంతంలో తుంగభద్ర వంతెనపై బరువైన వాహనాలు వెళ్లడంతో కంప్లి వైపు వంతెన ధ్వంసం కావడంతో వంతెన కింది భాగంలో నీరు లీకేజీ అవుతున్నాయని తెలిపారు. ఇలాగే వంతెనపై బరువైన వాహనాల అనుమతులు కల్పిస్తే రేపో మాపో వంతెన కూలే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు బరువైన వాహనాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ఈ సందర్భంగా గంగావతి ప్రజాప్రతినిధి అధికారి విశ్వనాథ్ కంప్లి ప్రజా పన్నుల అధికారి బసిరెడ్డి మాట్లాడుతూ త్వరలోనే వంతెనను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇకపై బరువైన వాహనాలు వంతెనపై వెళ్లకుండా చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా సంఘసంస్థల నాయకులు మాట్లాడుతూ గత ఎన్నో యేళ్ల పురాతనమైన ఈ వంతెన జలాశయం నుండి భారీ నీరు నదికి విడుదల వంతెన మాత్రం చెక్కుచెదరకుండా వుందన్నారు. వంతెన వుండటం వల్ల ఎంతోమంది బళ్లారి జిల్లా కంప్లి నుండి గంగావతి, సింధనూరు, రాయచూరు, కొప్పళ తదితర పట్టణాలకు ఎంతో అనుకుని వుందన్నారు. ఒక వేళ ఈ వంతెన కూలినట్లయితే ఒక్కసారి మీదుగా వెళ్లే పరిస్థితి ఏర్పడుతుంది కనుక అధికారులు అప్రమత్తమై వంతెన ధ్వంసం కాకుండా జాగ్రత్త వహించాలని కోరారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంజునాథ్, ఎమ్మెల్యే అన్నపూర్ణ

సండూర్ అభివృద్ధికి రూ.1,200 కోట్లు

● యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాష్ట్ర అధ్యక్షుడు మంజునాథ్

బళ్లారి సిటీ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పన్ను వాటాలు, గ్రాంట్ల పంపిణీలో రాష్ట్రానికి అన్యాయం చేస్తోందని కేంద్రం యొక్క ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకంగా భారీ ప్రచారం ప్రారంభించాలి అని కర్ణాటక ప్రాంత యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హెచ్.ఎస్. మంజునాథ్ గౌడ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ సమీపంలో కర్ణాటక ప్రాంత యువజన కాంగ్రెస్ నిర్వహించిన కాంగ్రెస్ యువజన సదస్సును ఆయన ప్రాంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఐదు హామీ పథకాలు రాష్ట్రంలో విజయవంతమయ్యాయి పేద ప్రజల ఆర్థికాభివృద్ధికి దోహదపడ్డాయి. ఉప ముఖ్యమంత్రి డీకే.శివకుమార్ చెప్పినట్లుగా సండూర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం రూ.1.200కోట్ల గ్రాంట్ విడుదల చేశారన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సండూరు అభివృద్ధికి కట్టుబడి ఉంది అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు రేషన్ బియ్యంతో పాటు ఇందిరా ఫుడ్ కిట్లను పంపిణీ చేయాలని నిర్ణయించిందని, దేశంలోనే తొలి సారిగా ఉద్యోగినులందరికీ రుతక్రమ సెలవులు కల్పించే విధానాన్ని అమలు చేయడం మాతృహృదయ ప్రభుత్వానికి నిదర్శనం అని ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారం అన్నారు.

ఈసందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి నిగమ్ భండారి , బళ్లారి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంజునాథ్,సోషల్ మీడియా అధ్యక్షుడు సిద్దుహళ్ళి గౌడ,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆశాలత, మున్సిపల్ అధ్యక్షుడు సిరాజ్, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

మాళవి నుంచి తుంగభద్రకు నీరు



తుంగభద్ర నదిలోకి చేరుతున్న నీరు

బళ్లారి సిటీ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : విజయనగరం జిల్లా హగరిబొమ్మనహళ్లి తాలూకాలోని మాలవి జలాశయం నిండిపోయి తుంగభద్ర నదిలోకి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం మాలవి జలాశయంకు క్రస్ట్‌గేట్లను ఏర్పాటు చేసే పనులు జరుగుఉతున్నాయని నీరులోపలికి రాకుండా ఒక బారియర్ వాల్‌ను నిర్మించారని మాలవి జలాశయ శాఖ అధికారి హులి రాజ్ తెలిపారు. మాలవి జలాశయంలోని 10క్రస్ట్ గేట్లపై ప్రస్తుతం మరమ్మదు పనులు జరుగుతున్నాయి . మూడు గేట్లను ఇప్పటికే మరమ్మతులు చేసి ఏర్పాటు చేశారు. మిగిలిన గేట్లపై మరమ్మతు పనులు జరుగుతున్నాయన్నారు. ఈసారి వర్షాలు బాగా కురువడంతో 2టీఎంసీల సామర్థ్యం గల మాలవిజలాశయం నిండడం ఖాయం. ఈ జలాశయం 16గ్రామాల్లోని 8,000 ఎకరాల భూమికి సాగునీరు అందించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. క్రస్ట్ గేట్ల ఏర్పాటు పూర్తి కాకపోవడంతో ఈ సారి రిజర్వాయర్ నుండి వచ్చే నీరు రైతులకు అందుబాటులో ఉండదు. అందువల్ల ఇప్పుడు వృధాగా పోతున్న నీరు రిజర్వాయర్‌లో నిల్వ చేసినా ఎటువంటి ఉపయోగం ఉండదని స్థానికులు పేర్కొంటున్నారు.

హోసూరు జోన్



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్ తదితరులు

కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

హోసూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): హోసూరు శాసనసభ నియోజకవర్గం హోసూరు కార్పొరేషన్‌లోని 14వ వార్డులో అసెంబ్లీ సభ్యుల అభివృద్ధి నిధులు రూ.10 లక్షలతో మురుగు కాలువ, రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. పార్టీకి చెందిన వెంకటేశ్ నేతృత్వంలో భూమి పూజ కార్యక్రమం జరిగింది. డీఎంకే పశ్చిమ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్యే వై ప్రకాశ్, మేయర్ సత్య భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆనందయ్య వార్డు కార్యదర్శి శేఖర్, కౌన్సిల్ ప్రతినిధి శరవణన్, యూత్ వింగ్ బాలాజీ, కృష్ణప్ప సీతారామన్ పాల్గొన్నారు.

జోరుగా బాణసంచా విక్రయాలు



బాణసంచా దుకాణం వద్ద వినియోగదారులు

హోసూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరం కర్ణాటక సరిహద్దులో ఉండడంతో అక్కడివారు బానాసంచా కొనుగోలు ఇక్కడికి వస్తుంటారు. సరిహద్దులో జూజూవాడీ చెక్ పోస్టు సమీపాన 50కిపైగా బాణాసంచా దుకాణాలు ఉన్నాయి. అలాగే తమిళనాడులో చాలా చోట్ల బాణసంచా కర్మాగారాలు ఉండడంతో స్థానికంగా ధరలు తక్కువగా ఉంటాయి. దీంతో పొరుగువారు ఇక్కడికి వచ్చి బాణసంచా కొనడం అలవాటు. దీపావళి సమీపిస్తున్న తరుణంలో ఆదివారం సెలువు కావడంతో బెంగళూరు నుంచి తరలి వచ్చారు. జాతీయ రహదారి వెంబడి ఉండే దుకాణలకు వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలను పోలీసు భద్రతతో లోపలికి అనుమంతించారు. ఎటువంటి అంతరాయం కలగకుండా క్యూలో నిలిచి కొనుగోలు చేయాలని ఆదేశించారు. పోలీసు ఇన్‌స్పెక్టర్ వీ సయ్యద్ ముబారక్ ప్రత్యేకంగా పర్యేక్షించారు. పోలీసులు భద్రతా పనులు నిర్వహిస్తున్నారు. దుకాణాలలో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యేకు గాయాలు



ఆస్పత్రిలో ఎమ్మెల్యే కరెమ్మ జీ నాయక్



దెబ్బతిన్న కారు

రాయచూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ జీ నాయక్ కారు ప్రమాదంలో గాయపడ్డారు. ఆదివారం దేవదుర్గ నుంచి హుబ్లీకి వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. లింగసుగూరు తాలూకా గురుగుంటా సమీపంలో కరెమ్మ వెళుతున్న కారు అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించబోయి సడన్ బ్రేక్ వేయడంతో అదుపు తప్పి కారు రోడ్డు పక్కలోని రాతికి ఢీకొంది. ఈ ప్రమాదంలో కరెమ్మకు స్వల్ప గాయాలు కాగా ఆమెను వెంటనే లింగసుగూరు తాలూకా ఆస్పత్రికి చేర్పించి చికిత్సనందించారు. విషయం తెలుసుకున్న లింగసుగూరు ఎమ్మెల్యే మానప్ప వజ్జల్ ఆస్పత్రికి వచ్చి ఎమ్మెల్యే కరెమ్మను పరమార్శి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



కప్‌తో విజేత జట్టు

కంప్లి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని సమాజ సేవకుడు మెట్రి, హోసకోటే జగదీష్ తెలిపారు. కంప్లి పట్టణంలో షామియా చందు పాఠశాల ఆవరణంలో గండుగలి కుమార్ రామ క్రికెట్ ట్రోఫీ పోటీలు జరిగాయి. ఇందులో పదిజట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. చివరకు ఆదివారం ఉదయం 11 వీఐపీ మార్నింగ్ క్రికెట్ జట్లు పోటీపడ్డాయి. మార్నింగ్ క్రికెటర్‌పై వీఐపీ 11 గెలుపొంది ప్రథమ స్థానం తగ్గించుకుంది ద్వితీయ స్థానం మార్నింగ్ క్రికెటర్ దక్కించుకుంది. అనంతరం వీఐపీ 11 జట్టుకు కప్పుతో పాటు రూ. 30 వేలు బహుమతులు అందించారు. ద్వితీయ స్థానం దక్కించుకున్న మార్నింగ్ క్రికెటర్ జట్టుకు కప్పుతోపాటు రూ.15 వేలు అందించారు. ఈ సందర్భంగా హోసకోటి జగదీష్ మాట్లాడుతూ తమ నాయకుడు నియోజకవర్గ ఎమ్మెల్యే ఆధ్వర్యం లోనే ఈ క్రికెట్ పోటీలు జరిగాయన్నారు. తమ నాయకుడు క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహం కల్పిస్తారని తెలిపారు. యువకులు చెడు అలవాట్లకు దూరంగా వుండి క్రీడల్లో పాల్గొని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ రాఘవేంద్ర మౌలా శ్రీనివాస్ రియాజ్ భలే మల్లికార్జున, రమేష్, జిలాన్, ముత్తన్న, నాగరాజు, గండుగలి కుమార్, రామ క్రికెట్ సభ్యులు కార్యదర్శి ముక్తార్, హాజారుద్దీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయాలని రైతుల వినతి



ఎమ్మెల్యే నాగరాజుకు వినతి పత్రం ఇస్తున్న తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు పురుషోత్తమగౌడ

సిరుగుప్ప, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వేసవికాలం పంటకు సాగునీరు విడుందల చేయాలని తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షులు పురుషోత్తమగౌడ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సిరుగుప్ప పట్టణంలో ఎమ్మెల్యే బీఎం నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఏప్రిల్ చివరి వరకు సాగునీరును విడుదల చేయాలని ఆయన కోరారు. ఈయేడాది భారీ వర్షాలు కురవడంతో టీబీ డ్యామ్ పూర్తిగా నిండివుందని ఆయన తెలిపారు. టీబీ డ్యామ్ అధికారులతో చర్చించి వేసవికాలం పంటలకు నీటిని విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు మల్లన్నగౌడ, భీమన్నగౌడ, రైతు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మౌనేశ్వర ఆలయానికి నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులు

సిరుగుప్ప, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ సమాజం అధ్యక్షుడు మౌనేష్ ఆచార్య ఆధ్వర్యంలో మౌనేశ్వర ఆలయ కమిటీ నూతన పదాధికారులు ఎన్నికయ్యారు. ఆదివారం సిరుగుప్ప పట్టణంలో పదాధికారుల ఎంపిక జరిగింది. నూతన అధ్యక్షుడిగా రామలింగాచారి, ఉపాధ్యక్షుడిగా శరణబసవ ఆచారి, కార్యదర్శిగా వీరేష్ ఆచారి ఎంపికయ్యారు. ఎంపికైన వారందరికి మౌనేష్ ఆచార్యులు పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బెనకల్ ఆచారి, వీరన్న ఆచారి, నాగరాజ ఆచారి పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు గొడుగుల పంపిణీ



గొడుగు అందజేస్తున్న ప్రగతి ట్రస్టు సభ్యుడు సురేష్ కుమార్

బళ్లారిరూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పటేల్ నగర్‌తో పాటు పలు కూడళ్లలో ఫుట్‌పాత్‌పై జీవనం చేసుకునే కూలీ కార్మికులకు ప్రగతి సేవా ట్రస్టు అధ్యక్షుడు టీఎస్ సురేష్ కుమార్ గొడుగులు పంపిణీ చేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో పలు సర్కిళ్లలో, కూడలిలో చెప్పులు కుట్టుకుని జీవనం సాగిస్తున్న వృద్ధులకు తమ వంతుగా గొడుగులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నాగరాజు, వెంకటేష్, శ్రీధర్, సాయితేజ, సూర్యతేజ ట్రస్టు మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులు లేక కళాశాల విద్యార్థులకు ఇబ్బందులు



లగేజీ ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

కంప్లి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కంప్లి పట్టణంలో డిప్లమో చదవటానికి వచ్చిన విద్యార్థులకు ఎన్ని సంవత్సరాలైనా కాలేజీకి వద్ద బస్సు స్టాప్ సౌకర్యం లేక ట్రాక్టర్లు, ఆటోలు, కార్లు ద్వారానే కాలేజీ చేరుకుంటున్నారని విద్యార్థులు తెలుపుతున్నారు. ప్రతినిత్యం కాలేజీలో విద్యాభ్యాసం పొందడానికి గ్రామాల నుండి పట్టణాలకు వస్తున్నారు. కంప్లి నుండి హోస్పేట్ కి వెళ్లే బస్సు కాలేజీ వద్ద విద్యార్థులకు స్టాప్ ఇవ్వకపోవడంతో తెలిపారు. సాయంత్రం నుండి ఇంటికి వెళ్లే సమయంలో కూడా రోడ్డుపైన వెళ్లే వాహనాలపైన ఆధారపడి తమ ప్రయాణం కొనసాగిస్తున్నామన్నారు. ఈ విషయంపైన పలుసార్లు ఎమ్మెల్యేకి తెలిపిన ప్రయోజనం లేకుండా పోయిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఉదయం కాలేజీకు వచ్చే సమయంలో వాల్మీకి సర్కిల్లో హాస్పిటల్‌కి వెళ్లేలా వాహనాలు నిలుపుతూ వాటిపైన ప్రయాణం కొనసాగిస్తున్నామన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ కష్టాలు శాపంగా మారాయని విద్యార్థులు తెలిపారు. ఇప్పటికైనా తాము పడుతున్న కష్టాలను దృష్టిలో వుంచుకుని డిప్లమో కాలేజీ వద్ద బస్టాప్ ఏర్పాటు పరచి సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యార్థులు కోరారు.



కారు లిఫ్ట్ అడుగుతున్న విద్యార్థులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

అశోక్‌కుమార్ (జయంతి)



దేశ సినీరంగంలో ఉత్తమ నటులలో ఒకరిగా పేరొందిన హిందీ నటుడు అశోక్‌కుమార్ 1911 అక్టోబరు 13న బీహార్ రాష్ట్రం భగల్‌పూర్‌లో జన్మించారు. అసలు పేరు కుముద్‌లాల్ గంగూలీ. 40, 50 దశకాలలో హిందీలో 'తొలి సూపర్ స్టార్'గా రాణించారు. నటుడు, నిర్మాత, గాయకుడిగానేక చిత్రకారుడిగా కూడా సత్తా చాటుకుని 'దాదామోని' గా పిలవబడ్డారు. 275కు పైగా సినిమాలలో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, విలన్‌గా, హీరోగా నటించారు. అంతేకాక 30కుపైౖ బెంగాలీ డ్రామాలలో నటించారు. దాదాసాహెబ్ ఫాల్కే, పద్మభూషణ్ తదితర పురస్కారాలు పొందారు. 2001 డిసెంబరు 10న కన్నుమూశారు.

అబ్బూరి ఛాయాదేవి (జయంతి)



ప్రముఖ రచయిత్రి అబ్బూరి ఛాయాదేవి 1933 అక్టోబరు 13న తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం (రాజమండ్రి)లో జన్మించారు. మధ్యతరగతి కుటుంబాలలో స్త్రీలు ఎదుర్కొనే సమస్యలపై ఎన్నో కథలు రాశారు. హిందీ, తమిళ, మరాఠీ, కన్నడ భాషలలోకి అనువాదం అయ్యాయి. వృత్తిరీత్యా డిప్యూటీ లైబ్రరియేన్‌గా పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ పొందారు. ఈమె భర్త అబ్బూరి వరద రాజేశ్వరరావు కూడా రచయిత కావడం విశేషం. 'బోన్సాయ్ బతుకు కథ'ను 2000 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 10వ తరగతి తెలుగువాచకంలో చేర్చింది. కేంద్రసాహిత్య అకాడమీ, ఉత్తమ రచయిత్రి, వాసిరెడ్డి రంగనాయకమ్మ సాహిత్య పురస్కారం తదితర పురస్కారాలు అందుకున్నారు. 2019 జూన్ 28న కన్నుమూశారు.

చిట్టిబాబు (జయంతి)



చల్లపల్లి చిట్టిబాబు 1936 అక్టోబరు 13న కాకినాడలో జన్మించారు. అసలుపేరు హనుమానులు అయితే ముద్దుగా చిట్టిబాబు అని పిలిచేవారు. క్రమంగా ఈ పేరుతోనే గుర్తింపు పొందారు. ఐదేళ్ల వయస్సులోనే వీణను వాయించి 12యేట ప్రదర్శన ఇచ్చారు. ఈమని శంకరశాస్త్రి ప్రధాన శిష్యుడిగా ఉంటూ కర్ణాటక సంగీతంలో రాణించి 'వీణాపాణి'గా పేరొందారు. 1967లో మైసూరు మహారాజుచే 'వైణిక శిఖామణి' గౌరవం పొందారు. టీటీడీచే 'సప్తగిరి సంగీత విద్వన్మణి', తమిళనాడు ప్రభుత్వంచే 'కలైమామణి', సంగీత నాటక అకాడమీ తదితర పురస్కారాలు అందుకున్నారు. వీణా వాదనలో రాణించి వీణ చిట్టిబాబుగానే పేరొందారు. 1996 ఫిబ్రవరి 9న కన్నుమూశారు.

కిషోర్‌కుమార్ (వర్ధంతి)



నేపథ్య గాయకుడు కిషోర్‌కుమార్ 1929 ఆగస్టు 4న మధ్యప్రదేశ్ రాష్ట్రం ఖాండ్వాలో జన్మించారు. అసలు పేరు అభాస్ కుమార్ గంగూలీ. నటుడు అశోక్‌కుమార్ సోదరుడు. ప్రముఖ నటులందరికీ పాటలు పాడారు. సంగీత దర్శకుడిగా, గేయ రచయితగా, రచయితగా, డైరెక్టర్‌గా, నిర్మాతగా, స్క్రీన్ రైటర్‌గా బహుముఖ ప్రజ్ఞాశాలి. ప్రత్యేకించి రాజేశ్‌ఖన్నా నటించిన 92 సినిమాలలో 245 పాటలు పాడారు. ఉత్తమగాయకుడిగా 8సార్లు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు పొందారు. 1987 అక్టోబరు 13న కన్నుమూశారు. కాగా ఢిల్లీలో 2012లో ఓసియన్ సినీఫాన్ ఆక్షన్‌లో అతను విడుదల చేయని చివరి పాట 15.6లక్షలకు అమ్ముడుకావడం విశేషం.

పాలికె ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యం

● ప్రతిపక్షనేత అశోక్ ధీమా



బీజేపీలో చేరిన శోభా జగదీశ్‌గౌడ, ఎంపీ, ఎమ్మెల్యే, ప్రతిపక్షనేత

బొమ్మనహళ్ళి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే పాలికె ఎన్నికల్లో బొమ్మనహళ్ళి నియోజకవర్గంలో 20కు 20 సీట్లను బీజేపీ కైవశం చేసుకోవడం ఖాయమని ప్రతిపక్షనేత అశోక్ ధీమా వ్యక్తం చేశారు. మంగమ్మనపాళ్య ఐటీఐ లే అవుట్ మైదానంలో ఆదివారం బీజేపీ చేరిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జీబీఏలో ఐదు పాలికెలో ఏర్పాటు చేశారని, కాంగ్రెస్ నిర్వహించిన అంతర్గత సర్వేలలో వారికి సంపూర్ణమద్దతు లభించలేదని తెలుస్తోందన్నారు. బీజేపీకి ఎక్కువ సీట్లు వస్తాయన్న ధీమా వ్యక్తం చేశారు. గత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి లేదన్నారు. కేవలం ఐదు గ్యారెంటీలు మినహా సాధించింది ఏమీలేదన్నారు. ఇప్పటికీ పలుచోట్ల రోడ్లపై గుంతలు ఉన్నాయని వ్యంగ్యం చేశారు. బొమ్మనహళ్ళి నుంచి కాంగ్రెస్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ శోభా జగదీశ్‌గౌడ తన అనుచరులతో బీజేపీలో చేరారు. ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్‌కు చెందిన కార్పొరేటర్ ప్రస్తుతం కాంగ్రెస్ పాలన తీరుపై అసంతృప్తితో ఉన్నారన్నారు. ఇప్పటికే తాను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందానని ఇక్కడి వారు బీజేపీకి మద్దతు ఇస్తున్నారన్నారు. ప్రజలు, కార్యకర్తల ఆదరాభిమానాలు మరువలేనన్నారు. త్వరలో జరిగే పాలికె ఎన్నికల్లో అన్ని వార్డులలోనూ బీజేపీ సత్తా చాటుకుని విజయం సాధిస్తామన్నారు. తొలుత వినాయక ఆలయంలో పూజలు నిర్వహించి అభిమానుల నినాదాల మధ్య మైదానానికి చేరుకున్నారు. కార్యక్రమంలో ఎంపీ తేజస్వీసూర్య, స్థానిక నాయకులు శ్రీనివాసరెడ్డి, నాగేశ్, శ్రీనివాసులు, పురుషోత్తమ్, మురళి, ఆనందరెడ్డి, మాజీ కార్పొరేటర్ గురుమూర్తిరెడ్డి, లక్ష్మణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికార పంపకంపై చర్చలు అసత్యం

● ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్ర సిద్దరామయ్య



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యతీంద్ర సిద్దరామయ్య

రాయచూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారం పంపిణీకి సంబంధించి కాంగ్రెస్ పార్టీలో చర్చ జరిగిందంటూ వస్తున్న వార్తలు ఊహాజనితమని శాసన మండలి సభ్యుడు డాక్టర్ యతీంద్ర సిద్దరామయ్య అన్నారు. ఈ విషయంలో రాజకీయ ప్రత్యర్థులు చేస్తున్న ఆరోపణలకు ఊహాజనక వ్యాఖ్యలకు సమాధానం చెప్పాల్సిన అవసరం అధికార పార్టీకి లేదన్నారు. ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చిన డాక్టర్ యతీంద్ర సిద్దరామయ్య నగరంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ముఖ్యమంత్రి మార్పుకు సంబంధించి వస్తున్న వార్తలో ఎలాంటి స్పష్టత లేదని ఈ విషయంలో పార్టీ నిర్ణయమే అంతిమ నిర్ణయంగా ఉంటుందన్నారు. డిసెంబరు నెలలో రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి స్వయంగా సూచనప్రాయంగా వెల్లడించినట్లు గుర్తు చేశారు. కాగా మైసూరు ఎంపీ జయసింహ చేసిన వ్యాఖ్యలు ఆధారరహితమని నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కాగా డీకే శివకుమార్ సీనియర్ మోస్ట్ నాయకుడని ఆయనకు క్రమ శిక్షణ గురించి అందరికంటే స్పష్టమైన అవగాహన ఉంటుందన్నారు. మైసూరు పర్యటనకు సంబంధించి మునిరత్నను ఆహ్వానించలేదన్నది సరికాదని నిజంగా ప్రజల సంక్షేమం పట్ల నిబద్ధత ఉన్న నాయకుడు మునిరత్న తాను స్వయంగా ఉపముఖ్యమంత్రి నిర్వహించే సమావేశంలో పాల్గొనాల్సి ఉండిందన్నారు. కాగా రాయచూరు కొప్పళ, బళ్ళారి జిల్లాల్లో కురుబలను ఎస్టీ జాబితాలో చేర్చే అంశం పై ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందని ఈ విషయంలో తుది నిర్ణయం తీసుకోవాల్సింది కేంద్ర ప్రభుత్వమేనన్నారు. కురుబ సమాజానికి చెందిన నాయకులకు నామినేటెడ్ పదవుల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఈ సందర్భంగా డాక్టర్ చతీంద్ర తెలిపారు.

న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలి



ప్రగతిపర సంఘాల నిరసన

దొమ్మసంద్ర, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సుప్రీకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించిన న్యాయవాది ధైర్యాన్ని ప్రశంసించిన బీజేపీ నేత, మాజీ ఐపీఎస్ భాస్కర్‌రావ్ తీరును ప్రగతిపర సంఘాలు ఖండించాయి. ఆనేకల్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆదివారం తమ నిరసన వ్యక్తం చేశారు. అనుచితంగా వ్యవహరించిన న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన టీజీ మోహన్ దాస్‌పై సీఐ తిప్పేస్వామికి ఫిర్యాదు చేశారు. భాస్కర్‌రావ్, న్యాయవాది అనిల్‌మిశ్రాలపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి కేసీ నాగరాజ్, ప్రొఫెసర్ డాక్టర్ మీనాక్షి, నాగచక్ర, గౌతం వెంకి, స్వాభిమాని సతీశ్, న్యాయవాది పురుషోత్తమ చిక్కహాగడె తదితరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

బొమ్మనహాళ్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఈత రాకపోయినా నీటిలో దిగిన ఓ విద్యార్థి గల్లంతై మృతి చెందాడు. బొమ్మనహాళ్ మండలంలోని బొల్లనగుడ్డం గ్రామ సమీపంలో హగరి నదిలో విషాదం చోటుచేసుకుంది. స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన శివకుమార్ (16) నీటిలో మునిగి మృతి చెందాడు. బొమ్మనహాళ్ ఎస్‌హెచ్‌ఓ కమల్‌బాషా తెలిపిన మేరకు.. బొల్లనగుడ్డం గ్రామానికి చెందిన బసమ్మ, రుద్రణ దంపతుల కుమారుడు శివకుమార్ గోవిందవాడ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. మిత్రులు శివ, పూజారి శివ, తిప్పేష్, హర్ష, వన్నూరుస్వామితో కలిసి శనివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని హగరి నదిలో ఉన్న నీటి కుంటలో ఈతకు వెళ్లాడు. ఈత రాకపోవడంతో రెండుసార్లు స్నేహితులు అతడిని బయటకు తీశారు. అయినా మూడోసారి నీటిలోకి దిగడంతో గల్లంతయ్యాడు. సాయంత్రం ఇంటికి వెళ్లిన స్నేహితులు భయంతో ఎవరికి చెప్పలేదు. రాత్రయినా శివకుమార్ ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. శనివారం అర్ధరాత్రి బొమ్మనహాళ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి గ్రామంలో విచారించి స్నేహితులను గట్టిగా ప్రశ్నించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే కుంట వద్ద గజ ఈతగాళ్ల సహాయంతో శవాన్ని వెలికి తీశారు. కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆదివారం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.



రన్‌కు జెండా చూపుతున్న ఎంపీ తేజస్వీసూర్య

జోరుగా డేర్ రన్

బెంగళూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కీళ్లనొప్పులపై ప్రజలలో అవగాహన పెంచాలని దీ హాస్పిటల్స్ ఏర్పాటు చేసిన డేర్ రన్ ఉత్సాహంగా సాగింది. ఫోరం సౌత్ కోణనకుంటె క్రాస్ వద్ద ఆదివారం ఉదయం ఎంపీ తేజస్వీసూర్య జెండా ఊపి ప్రారంభించారు. 5కే, 10కే, మజా రన్ విభాగాలుగా రన్ సాగింది. 5వేలమంది పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తేజస్వీ సూర్య మాట్లాడుతూ ఆరోగ్యంపట్ల ప్రజలలో అవగాహన కల్పించేలా ఇలాంటి కార్యక్రమాలు ఆసుపత్రులు నిర్వహించడం సంతోషకరమన్నారు. దీ ఆసుపత్రుల సీఈఓ డాక్టర్ చంద్రశేఖర్ చిక్కమునియప్ప మాట్లాడుతూ ఇంటర్నేషనల్ ఆర్థరైటిస్ డేను పురస్కరించుకుని పరుగుల పోటీ నిర్వహించామన్నారు. నగర ప్రజలలో అనూహ్యమైన స్పందన వచ్చిందన్నారు. కీళ్లనొప్పులు తొమ్మిదేళ్లనుంచి 97ఏళ్ల వారికి ఎవరికైనా రావచ్చునన్నారు. కనీసమైన ఆరోగ్యపు అలవాట్లు, డాక్టర్ సలహాలు పాటించడం ముఖ్యమన్నారు. ఇదే సందర్భంగా మోకాలి మార్పిడి చికిత్స పొందిన హెచ్‌ఎస్ నాగరాజు, బీఎస్ శ్రీకాంతరావులు తమ అనుభవాలను మీడియాతో పంచుకున్నారు.

6 అంగుళాలు కూడా ఇచ్చేది లేదు

బెంగళూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సొరంగ మార్గ నిర్మాణానికి లాల్‌బాగ్‌లో 6 ఎకరాలు కాదు 6 అంగుళాలు కూడా ఇచ్చేది లేదని బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వి సూర్య హెచ్చరించారు. బెంగళూరును అధ్వానం చేసే ప్రాజెక్టు ఇది అన్నారు. ఆదివారం ఎంపీ తేజస్వీసూర్య లాల్‌బాగ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టన్నెల్‌రోడ్డు సామాన్య ప్రజలకోసం కాదని కార్లు, భారీ వాహనాలు ఉండేవారికోసమన్నారు. 300ఏళ్లుగా ఉండే లాల్‌బాగ్‌ను జీబీఏ అధికారులు అలైన్‌మెంట్ చూపి నిర్మాణాలు చేయదలచుకుంటే వదిలేది లేదన్నారు. లాల్‌బాగ్‌ను కమర్షియల్ చేస్తారా... అంటూ మండిపడ్డారు. ఎట్టి పరిస్థితుల్లోనూ లాల్‌బాగ్‌లో సొరంగమార్గ నిర్మాణానికి అవకాశం ఇచ్చేది లేదన్నారు.

అభిషేక్ డెత్‌నోట్ వైరల్

బెంగళూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఉడుపి జిల్లా కార్కళ బెల్మణ్ లాడ్జ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన అభిషేక్ ఆచార్య (23)కు సంబంధించి డెత్‌నోట్ సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. ఏకంగా ఏడు పేజీల డెత్‌నోట్ శనివారం లభ్యమైంది. మంగళూరులోని ప్రభుత్వ లేడీ గోషన్ ఆసుపత్రిలో బయోమెడికల్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నా అని అక్కడ నర్సు నిరీక్షతోపాటు పలువురి వేధింపులు మానసికంగా కుంగిపోయేలా చేశాయని రాసుకున్నారు. నిరీక్ష మిత్రులు గురుపుర కైకొంబ నివాసి రాకేశ్, కంకనాడి నివాసి రాహుల్, కైకొంబ నివాసి తస్లింలు కారకులుగా రాసుకున్నారు. నాకు సంబంధించిన అశ్లీల వీడియోను ఉంచుకుని ఓసారి దాడి చేశారని, హత మారుస్తామని బెదరించినట్టు రాసుకున్నారు. నిరీక్ష తాము తలచుకుంటే ఏమైనా చేస్తామని, చట్టం మాకు అనుకూలంగా ఉందని అట్రాసిటీ కేసు పెడతామని బెదరించినట్టు తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ నేత ప్రవీణ్ నెట్టారు హత్య సమయంలో వాట్సప్ స్టేటస్ వేసినందుకు విదేశాలనుంచి ఫోన్‌కాల్స్ వచ్చాయని రాసుకున్నారు. ఇప్పటికే రూ.3-4లక్షలదాకా ఇచ్చానని, ప్రతి నెలా డబ్బులు ఇవ్వాలని వేధిస్తున్నారన్నారు. రూ.20లక్షలు ఇస్తే వదిలిపెడతామని వారు చెప్పారన్నారు. అయితే పోలీసుల ప్రాథమిక విచారణలో అభిషేక్ ప్రేమ విఫలమై ఆత్మహత్యకు పాల్పడినట్టు ఉడుపి జిల్లా ఎస్పీ హరిరామ్‌శంకర్ మీడియాకు తెలిపారు. డెత్‌నోట్‌కు అనుగుణంగా దర్యాప్తు చేస్తామన్నారు.

ఏపీఎంసీ ఎన్నికల్లో ఓటు వేస్తూ వ్యక్తి మృతి



శీనప్ప (ఫైల్)

బంగారపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తాలూకా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ సహకారసంఘం, జనతాబజార్‌కు ఎన్నికలు కాంగ్రెస్, ఎన్డీఏ మైత్రికూటమి సభ్యులు పోటీ పడ్డారు. ఆదివారం ఉదయం నుంచి పోలింగ్‌కు సభ్యులు క్యూ కట్టారు. ఇలాంటి తరుణంలో కణింబెలె గ్రామానికి చెందిన శీనప్ప (75) ఓటు వేసిన అనంతరం ఒక్కసారిగా కుప్పకూలాడు, అక్కడే బందోబస్తులో ఉన్న పోలీసులు వెంటనే తమ వాహనంలో అత్యవసరంగా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. శీనప్ప కుమారుడు ఆంజనప్ప కోలారు లోకాయుక్త ఇన్‌స్పెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. శీనప్ప అకస్మిక మృతితో స్థానికంగా విషాదం నెలకొంది. మరోవైపు ఏపీఎంసీ ఎన్నికల పోలింగ్ కొనసాగింది.

ఉత్సాహంగా ఆర్‌ఎస్‌ఎస్ పథసంచలనం



బొమ్మనహళ్ళిలో పథసంచలనంలో ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి



సర్జాపురలో ఆర్‌ఎస్‌ఎస్ పథసంచలనం

బొమ్మనహళ్ళి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) వందేళ్ల సందర్భంగా ఆదివారం ప్రత్యేక పథసంచలనం నిర్వహించారు. ఐటీఐ మైదానంలో పూజలు చేసి నుంచి హెచ్‌ఎస్ఆర్ లే అవుట్‌లోని అటల్ బిహారి వాజ్‌పేయ్ మైదానానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే సతీశ్ రెడ్డి తోపాటు వందలాదిమంది ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు పాల్గొన్నారు. మరోవైపు కోడిచిక్కనహళ్ళి నుంచి బొమ్మనహళ్ళి వరకు మరో బృందం ర్యాలీ నిర్వహించింది. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు.

క్రమశిక్షణకు మారుపేరు ఆర్‌ఎస్‌ఎస్

మహదేవపుర: సమాజసేవ ధ్యేయంగా ఏర్పాటైన ఆర్‌ఎస్‌ఎస్ దేశ నిర్మాణంకోసం తనవంతు కృషి చేస్తోందని మాజీ మంత్రి అరవింద లింబావళి పేర్కొన్నారు. హూడిలోని కుందలహళ్ళి విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటైన పథసంచలనంలో ఆయన పాల్గొన్నారు.. హూడి స్పోర్ట్స్‌క్లబ్ నుంచి తిగళరపాళ్య, రాజపాళ్య, బసవణ్ణనగర స్కూల్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా లింబావళి మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరుగా ఆర్‌ఎస్‌ఎస్ ఉందన్నారు. యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, శ్రద్ధ పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సుమారు 5 కిలోమీటర్లపాటు సాగిన పథసంచలనంలో 300మందికిపైగా స్వయం సేవకులు పాల్గొన్నారు.

సర్జాపురలో ఆకట్టుకున్న ర్యాలీ

దొమ్మసంద్ర: సర్జాపుర పట్టణంలోని అంబేడ్కర్ క్రీడా మైదానం నుంచి ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులు పథసంచలనం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల సంబరం, విజయదశమి ర్యాలీలో భాగంగా కార్యక్రమాలు సాగాయి. భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ సాగారు. ఆర్‌ఎస్‌ఎస్ బెంగళూరు దక్షిణ జిల్లా విభాగం సంఘ్ సంచాలకులు హరీశ్‌బాబు, సర్జాపుర పట్టణ సంఘ్‌కు చెందిన మురళీధర్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

ముళబాగిలులో..

ముళబాగిలు: ముళబాగిలు తాలూకా ఆర్‌ఎస్‌ఎస్ శాఖ ఆధ్వర్యంలో పథసంచలనం సాగింది. పట్టణంలోని ఉద్భవ లింగేశ్వరస్వామి ఆలయం వద్ద పథసంచలన రథానికి పూజలు చేశారు. ముత్యాలపేట, ఎంసీ రోడ్డు, అంబేడ్కర్ సర్కిల్, నేతాజినగర్, సోమేశ్వరపాళ్య, గుణగంటపాళ్య, ధర్మరాజపాళ్య, శ్రీనివాసపుర సర్కిల్, విఠలనారాయణస్వామి తదితర ప్రాంతాలలో ర్యాలీ సాగింది. 350మందికిపైగా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఏఎస్పీ గణేశ్ నేతృత్వంలో బందోబస్తు సాగింది.

చదరంగంతో పిల్లల్లో మేధస్సు

● రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు రవికుమార్
● ఉత్సాహంగా పాత్రికేయుల పిల్లల చదరంగం శిక్షణ

రాయచూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మేధోవికాసానికి చదరంగం మంచి ఉపకరణ క్రీడ అని ఇందులో శిక్షణ పొందడం అభినందనీయమని రోటరీ క్లబ్ రాయచూరు మాజీ అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. రిపోటర్స్ గిల్డ్, రోటరీ క్లబ్, వేదాంత కళాశాలల విద్యాసంస్థల ఆధ్వర్యంలో జిల్లా పాత్రికేయుల పిల్లల కోసం ఏర్పాటు చేసిన చదరంగం శిక్షణ శిబిరాన్ని రవికుమార్ ప్రారంభించారు. నగరంలోని ప్రెస్‌క్లబ్ పత్రికా భవనం వద్ద ఆదివారం నిర్వహించిన శిబిరం కోలాహలంగా సాగింది. అనేక మంది పాత్రికేయులకు చెందిన విద్యార్థులు ఈ శిక్షణ శిబిరంలో పాల్గొని చదరంగం పై శిక్షణ పొందేందుకు సిద్ధమైయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు రవికుమార్, చదరంగం పై ఆసక్తి ఉన్న వారికి మేధోవికాసం తప్పనిసరిగా సాధ్యపడుతుందన్నారు. ప్రతియొక్కరు చదరంగాన్ని నేర్చుకోవాలన్నారు.

భారీ వర్షానికి కూలిన ఇళ్లు



వివరాలు ఆరాతీస్తున్న అధికారులు

శిడ్లఘట్ట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట పట్టణంతోపాటు తాలూకా వ్యాప్తంగా శనివారం రాత్రి కురిసిన వర్షం కారణంగా ఇంటిగోడ ఒకటి కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. నగరత్‌పేటలోని మంజునాథ్‌కు చెందిన ఇల్లు గోడలు కూలాయి. ఈ సందర్భంగా సమీపంలోని విద్యుత్‌స్తంభం విరిగి సగానికి వాలిపోయింది. అయితే అదృష్టవశాత్తు పెను ప్రమాదం తప్పినట్టయ్యింది. కాగా తాలూకాలోని జంగమకోటె గ్రామంలో 4 ఇళ్లు దెబ్బతిన్నట్టు తహసీల్దార్ గగనసింధు తెలి పారు. వెంటనే విద్యుత్‌స్తంభాన్ని బాగు చేయాలని విద్యుత్‌శాఖ అధికారు లకు తహసీల్దార్ సూచించారు. కాగా దుస్థితిలో ఉన్న ఇళ్లలో ఎవరూ ఉండ రాదని సూచించారు. ఆదివారం పట్టణంలో నగరసభ కమిషనర్ అమృత, రెవెన్యూ శాఖ పీడీఓ నాగరాజ్, స్థానిక ప్రముఖులు విజయకుమార్, నవీన్‌లు పరి శీలించారు. కొన్ని చోట్ల మురుగు కాలువలలో పూడిక తీయకపోవడంతో వర్షపునీటితో కలసి రోడ్లపైకి వస్తున్నట్టు వారి దృష్టికి స్థానికులు వివరించారు.



విరిగిన విద్యుత్ స్తంభం